


మద్యం కుంభకోణం విషయంలో మిథున్‌రెడ్డిని శనివారం ఏడు గంటలపాటు విచారించిన సిట్, అదే రోజు రాత్రి అరెస్టు చేసింది. శని, ఆదివారాల్లో వైసీపీ నాయకులు జిల్లాలో ఎక్కడా నిరసనలు చేయలేదు. పత్రికా ప్రకటనల్ని మాత్రమే విడుదల చేశారు. సోమవారం వైసీపీ అధిష్ఠానం ఆదేశించడంతో, కొన్నిచోట్ల నామమాత్రంగా నిరసనలు చేశారు. చిత్తూరు, పుంగనూరు, పలమనేరు ప్రాంతాలతో పాటు మిథున్‌రెడ్డి సొంత ప్రాంతం సదుంలో సుమారు 100-150 మందితో నిరసనలు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో కాసేపు రోడ్ల మీద ప్లకార్డులతో నిలబడి వెళ్లిపోయారు. ఈ తీరుపై వైసీపీలోనే కాదు ప్రజల్లోనూ తీవ్ర చర్చ నడుస్తోంది.

లిక్కర్ స్కాం.. వైసీపీ నీరసం



మిథున్‌రెడ్డి అరెస్టుపై స్పందన అంతంతే!

- రెండు రోజులు ప్రకటనలకే పరిమితమైన వైసీపీ నేతలు
- అధిష్ఠానం ఆదేశాలతో మూడో రోజు నామమాత్రపు నిరసనలు
- పెద్దిరెడ్డిపై పార్టీలోనూ అసంతృప్తే కారణమా?

చిత్తూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వైసీపీ స్పందన, ఆ పార్టీ జిల్లాలో ఎంత బలహీనంగా మిగిలిందో వెల్లడిస్తోంది. రాజకీయంగా ఉమ్మడి జిల్లాను శాసించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు, జగన్‌కి అత్యంత సన్నిహితుడైన ప్రస్తుత ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు పట్ల జనంలో వ్యతిరేకత లేకపోయినా, కనీసం పార్టీలో అయినా తగినంత స్పందన లేకపోవడం ఏమిటని.. వైసీపీ నేతలో ఆశ్చర్యపోతున్నారు. చాలా మంది నాయకులు మీడియా మీట్‌లూ, ప్రకటనలకే పరిమితం కావడం, అక్కడక్కడా చిన్నపాటి నిరసనలతో సరిపెట్టుకోవడం వారిని ఆందోళన పెడుతోంది. పెద్దిరెడ్డి రాజ్యంగా విలసిల్లిన పుంగనూరు నియోజకవర్గంలోనూ నీరసంగానే నిరసన సాగడం విశేషం.

జనంలో సానుభూతి కరువు

జగన్ అధికారంలో ఉన్నప్పుడు మద్యం ధరలు విపరీతంగా ఉండడం, ఊరూపేరూ లేని కొత్త బ్రాండ్లు మాత్రమే అమ్మడం, వాటి వల్ల తీవ్ర అనారోగ్యానికి గురవడం వంటి కారణాల వల్ల ప్రజల్లో వ్యతిరేకత బలంగా ఉందని భావిస్తున్నారు. దీనికి కారకులైన వారిపట్ల కనీస సానుభూతి కూడా ఇందువల్లే కరువైందని అంటున్నారు. పైగా వేల కోట్ల సొమ్ములు దోచుకున్న తీరు మీడియాలో కథనాలుగా వస్తుండంతో ఇంతకు తెగించారా అని ప్రజలు నోళ్లు వెళ్లబెడుతున్నారు. అందుకే అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రతి పండక్కీ పబ్బానికీ వందల కోట్లు ఖర్చు పెట్టి బట్టలు, కానుకలూ, మిఠాయిలూ పంపినా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వంటివారి పట్ల కూడా చంద్రగిరి నియోజకవర్గంలో సైతం సానుభూతి లేదని జనంలో చర్చ నడుస్తోంది. జనంలో సానుభూతి లేకపోవడం వల్లే వైసీపీ నాయకులు కూడా వారి తరహా బలప్రదర్శనతో కూడిన నిరసనలకు ధైర్యం చేయలేకపోతున్నారని అంటున్నారు.

వైసీపీలోనూ వ్యతిరేకత

పెద్దిరెడ్డి కుటుంబంపై జిల్లా వైసీపీ శ్రేణుల్లోనూ తీవ్ర అసంతృప్తి ఉండడంతోనే అరెస్టుపై అనుకున్నంత స్పందన లేదని తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యేలకు వ్యతిరేక వర్గాలను ఏర్పాటు చేసి ప్రోత్సహించడం.. మైన్, వైన్, సాండ్, ల్యాండ్ వంటి అన్నింట్లోనూ ద్వితీయ శ్రేణి నాయకులకు అందకుండా తనే నడపడం.. వంటి కారణాలతో ఆ కుటుంబంపై జిల్లా వైసీపీ నాయకుల్లో వ్యతిరేకత ఉందనే విషయం ఇప్పుడు వెల్లడవుతోందని ఆ పార్టీ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది.

ఇదీ పెద్దిరెడ్డి ఘనత

జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి చక్రం తిప్పిన తీరును గుర్తు చేసుకుంటున్నారు. 2019 ఎన్నికల సమయంలో పూతలపట్టు సిట్టింగ్ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను కాదని ఎంఎస్‌బాబును తెరపైకి తెచ్చారు. 2024లో మళ్లీ ఎంఎస్‌బాబును ఇబ్బంది పెట్టారు. సునీల్‌కుమార్ అప్పట్లో జగన్ ఇంటి ఎదుట రోజంతా నిలబడినా అపాయింట్‌మెంట్ ఇవ్వని వీడియో దళిత సంఘాల్లో ఆగ్రహాన్ని రగిల్చింది. 2024లో ఎంఎస్‌బాబుతో పాటు సత్యవేడు ఆదిమూలానికీ టికెట్ రాకుండా చేయడంతో ఇద్దరూ పెద్దిరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. పెనుమూరుకు చెందిన మాజీ ఎంపీ జ్ఞానేందర్‌రెడ్డిని ప్రోత్సహించి డిప్యూటీ సీఎంగా ఉన్న నారాయణస్వామిని ఇబ్బంది పెట్టారనే ఆరోపణలున్నాయి. నగరిలో రోజాను ఇబ్బంది పెట్టేందుకు చక్రపాణిరెడ్డి, కేజే కుమార్ వంటివారిని ప్రోత్సహించారు. చిత్తూరులో అటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల్ని, ఇటు విజయానందరెడ్డినీ ఎదగనీయకుండా పావులు కదిపేవారు. ఎన్నికల సమయంలో విజయానందరెడ్డితో బాగుంటూనే ఆయనకు టికెట్ రాకుండా తీవ్ర ప్రయత్నాలు చేశారని ఆరోపణలున్నాయి. జనసేనలోకి ఆరణి వెళ్లిపోయేలా చేశారు. ఈ ఇద్దర్నీ కాకుండా మూడో వ్యక్తి కోసం ప్రయత్నించినట్టు సమాచారం. పలమనేరులో వెంకటేగౌడకు చెక్ పెట్టేందుకు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తిని విపరీతంగా ప్రోత్సహించారనే ఆరోపణలున్నాయి. అధికారులు కూడా కృష్ణమూర్తికి ప్రాధాన్యతనిచ్చేవారు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్‌ను పక్కన పెట్టుకుంటూనే సెంథిల్‌కుమార్‌ను వ్యతిరేక వర్గంగా మార్చారు. మదనపల్లెలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు 2024లో టికెట్ రాకుండా చేశారు. అత్యంత సీనియర్ ఎమ్మెల్యే అయినటువంటి పీలేరు చింతల రామచంద్రారెడ్డికి టీటీడీ బోర్డు మెంబర్ పదవి రాకుండా చేసి తమ అనుచరుడు పోకల అశోక్‌కుమార్‌కు వచ్చేలా చేశారు. తిరుపతి, చంద్రగిరిల్లోనూ ఆయన చాపకింద నీరులా వ్యవహరించేవారని అంటారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జగన్‌కు సన్నిహితంగా ఉండడం ఆయనకు మింగుడు పడేది కాదంటారు. చెవిరెడ్డి కూడా కొన్ని సందర్భాల్లో తన ప్రత్యర్థి పట్ల పెద్దిరెడ్డి ఎన్నడూ వ్యతిరేకంగా లేరని అనేవారు. తిరుపతి జిల్లాలో కూడా తనకు ప్రొటోకాల్ ఉండాలని తన నియోజకవర్గంలోని రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను తిరుపతిలో కలిపేందుకు పెద్దిరెడ్డి చేసిన ప్రయత్నాలను చెవిరెడ్డి అడ్డుకున్నారని అంటారు. తిరుపతిలోనే నివాసం ఉండే పెద్దిరెడ్డి తిరుపతి నగరంలోనూ, చుట్టుపక్కలా భూవ్యవహారాల్లో జోక్యం చేసుకునేవారు. సిటింగ్ ఎమ్మెల్యేకి ఇది ఇబ్బందిగా ఉన్నా జగన్‌తో వారికున్న పలుకుబడి వల్ల మౌనంగా భరించేవారని చెప్పుకుంటారు. మొత్తానికి ప్రతి నియోజకవర్గంలోనూ రాజకీయ పెత్తనం సాగించినందునే పెద్దిరెడ్డి కుమారుడు అరెస్టు పట్ల ఎక్కడా బలమైన నిరసనలు లేవని భావిస్తున్నారు.

త్వరలో పుంగనూరుకు హంద్రీ-నీవా జలాలు

ఎంపీ మిథున్ అరెస్టుపై వైసీపీ రాద్ధాంతం ● చల్లా రామచంద్రారెడ్డి



పుంగనూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా జలాలు త్వరలో పుంగనూరు మీదుగా కుప్పం చేరుకుంటాయని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పుంగనూరులో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఈనెల 17న నంద్యాల జిల్లా మాల్యాలలో కృష్ణా జలాలను హంద్రీ-నీవా కాలువలకు విడుదల చేశారన్నారు. త్వరలోనే పుంగనూరు చెరువులకు కృష్ణాజలాలు చేరుతాయని.. రైతులు, ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సినిమా స్టంట్‌గా కుప్పంలో హంద్రీ-నీవా కాలువకు నీటిని విడుదల చేసి మాజీ సీఎం జగన్ అభాసుపాలైన విషయాన్ని గుర్తుచేశారు. కేవలం 10 శాతం పెండింగ్ పనులు కూడా నాడు జగన్ పూర్తి చేయలేకపోయారన్నారు. ఏపీ లిక్కర్ స్కామ్‌లో సిట్ విచారణలో నిందితుడిగా తేలిన తర్వాతే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని చెప్పారు. దీనిపై వైసీపీ నాయకులు మాత్రం తప్పుడు కేసులంటూ రాద్ధాంతం చేయడం తగదన్నారు. వైసీపీ పాలనలో పుంగనూరులో సుమారు వెయ్యి మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై పెద్దిరెడ్డి అన్యాయంగా కేసులు పెట్టారని ఆరోపించారు. తనతోపాటు టీడీపీ నేతలు వందలాది మందిపై అక్రమంగా హత్యాయత్నం, రౌడీషీట్లు తెరవడం, ఎదురు తిరిగితే దౌర్జన్యాలు, దాడులు, అరాచకాలకు పాల్పడ్డారని వాపోయారు. ప్రస్తుతం పుంగనూరుతోపాటు రాష్ట్రం అంతా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా ఉందని.. ప్రజలు సంతోషంగా ఉన్నారని వివరించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ మణికంఠ

పోలీసుల ప్రవర్తన ఆదర్శనీయంగా ఉండాలి

● ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పోలీసుల ప్రవర్తన ఆదర్శనీయంగా ఉండాలని ఎస్పీ మణికంఠ సూచించారు. మంగళవారం స్థానిక జడ్పీ సమావేశపు హాలులో జిల్లా పోలీసులు, ఇతర శాఖల అధికారులతో అర్ధ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విజిబుల్ పోలీసింగ్ పెంచాలని చెప్పారు. మెడికో- లీగల్‌సెల్ కేసుల్లో వైద్య ఆరోగ్యశాఖ సహకారం, పోస్టుమార్టం నివేదికల విషయంలో నిపుణుల అభిప్రాయాలతోపాటు రోడ్లు, ఐటీ విభాగం, విద్యుత్‌శాఖల అధికారుల సమాచారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల తగ్గింపు, మాదక ద్రవ్యాల నిరోధం, దొంగతనాలు, గ్రేవ్‌కేసులు, పోక్సో కేసులపై సమీక్షించారు. అసాంఘిక కార్యక్రమాల నివారణకు డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. యాప్ ద్వారా లోన్ ఇస్తామని చెప్పేవారి మాటలను నమ్మొద్దని సూచించారు. ఎవరైనా మోసపోతే 1930 నెంబరుకు కాల్ చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, డీఆర్వో మోహన్‌కుమార్, రైల్వే డీఎస్పీ హర్షిత, ఆర్టీవో రంజిత్‌కుమార్, డీఈవో వరలక్ష్మి, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అడవుల్లో సోలార్ రిఫ్లెక్టర్ లైట్లు

జంతువుల నుంచి ప్రజల రక్షణ నిమిత్తం ఏర్పాటు చేయనున్న అటవీశాఖ



సోలార్ రిఫ్లెక్టర్ లైట్

చిత్తూరు సెంట్రల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఏనుగులు, ఇతర అడవి జంతువుల బారినుంచి అటవీ సరిహద్దు ప్రాంత ప్రజల రక్షణ నిమిత్తం అడవుల్లో ప్రత్యేక సోలార్ రిఫ్లెక్టర్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు అటవీ శాఖ తూర్పు ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్ తెలిపారు. అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలను జంతువుల బారి నుంచి కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా బెంగళూరులో ప్రత్యేకంగా తయారు చేసిన సోలార్ రిఫ్లెక్టర్ లైట్లు పంపిణీ

..మిగతా 7వ పేజీలో

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు



మహానందికి క్షీరాభిషేకం

ఐరాల(కాణిపాకం), జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి గుడిలో ప్రదోష కాల పూజలను మంగళవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మణికంఠేశ్వరస్వామి మూలవిరాట్‌కు, స్వామికి ఎదురుగా ఉన్న మహానందికి అభిషేకాన్ని ఏక కాలంలో నిర్వహించారు. ఈ పూజలను తిలకించడానికి భారీగా భక్తులు కాణిపాక క్షేత్రానికి విచ్చేశారు. ఆలయ ఈవో పెంచలకిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, అర్చకుడు బాలుస్వామి, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, భక్తులు పాల్గొన్నారు.

డీఈఈ సెట్ అభ్యర్థుల కౌన్సెలింగ్ గడువు పెంపు

వెదురుకుప్పం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): డీఈఈ సెట్ అభ్యర్థుల కౌన్సెలింగ్ గడువును గురువారం వరకు పొడిగించినట్లు కార్వేటినగరం జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఒక ప్రభుత్వ డైట్, ఒక ప్రైవేటు డైట్ ప్రవేశాలకు 194 సీట్లకుగాను 89 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు కార్వేటినగరం డైట్‌కి వచ్చి నేరుగా సర్టిఫికెట్లను పరిశీలించుకోవచ్చని సూచించారు.

అక్రమంగా తరలిపోతున్న గ్రానైట్

వివరాలు 7లో

కేంద్ర ప్రకటనతో

రాష్ట్రంపై తగ్గిన భారం



బంగారుపాళ్యం ర్యాంపుల వద్ద మామిడి కాయల్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

కిలో మామిడి కాయలకు రూ.1.86 ఇవ్వనున్న కేంద్రప్రభుత్వం

చివరకు రైతుకు అందేది మాత్రం రూ.4 సబ్సిడీయే

చిత్తూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు సాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకొచ్చింది. కిలోకు రూ.1.86 ఇవ్వనుంది. మామిడి రైతుల నుంచి డిమాండ్లు, నిరసనలు రాకముందే జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు కిలోకు రూ.4 సబ్సిడీ ప్రకటించేశారు. కర్ణాటకలో మామిడి రైతుల పరిస్థితుల్ని వివరిస్తూ అక్కడి కేంద్రమంత్రి కుమారస్వామి కేంద్రానికి లేఖ రాశారు. ఆయన లేఖకు స్పందించిన కేంద్రం అనేక ఆంక్షలు పెట్టి రూ.16 మద్దతు ధర, అందులో 25 శాతం సబ్సిడీ, దాంట్లో మళ్లీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో వాటా వేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఓ హెక్టారు నుంచి 13 టన్నుల కాయలు దిగుబడి అయితే 5 టన్నులే కొనుగోలు చేస్తూ, అది కూడా రెండు హెక్టార్లకే లిమిటేషన్ పెట్టింది. దీంతో అత్యధిక తోపులున్న ఓ రైతుకు గరిష్ఠంగా రూ.40 వేల సబ్సిడీ అందుతుంది. కానీ, మన వద్ద గరిష్ఠం అంటూ ఏం లేదు. రూ.2 లక్షల సబ్సిడీ పొందే రైతులు కూడా ఉన్నారు.

సాయం కోరుతూ కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

కేంద్ర ప్రభుత్వం కర్ణాటకలో రైతులకు సబ్సిడీ ప్రకటించాక సీఎం చంద్రబాబు కూడా కేంద్రానికి లేఖ రాశారు. రాష్ట్రంలోని తోతాపురి రైతులకు సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. స్పందించిన కేంద్రం మంగళవారం ఉత్తర్వుల్ని విడుదల చేసింది.

కేంద్రం రూ.1.86.. రాష్ట్రం రూ.2.14

మన వద్ద కేంద్రం కిలోకు మద్దతు ధర రూ.14.90గా నిర్ణయించింది. అందులో 25శాతం సబ్సిడీ అందించనుంది. అంటే రూ.3.72 అన్నమాట. అందులో మళ్లీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటా వేసుకోవాలి. అంటే కేంద్రం రూ.1.86, రాష్ట్రం రూ.1.86గా వాటా వేసుకుని రైతుకు రూ.3.72 అందించాలి. ఈ లెక్కన ఇప్పటికే సీఎం చంద్రబాబు రూ.4 సబ్సిడీ ప్రకటించిన నేపథ్యంలో రైతులకు కిలోకు 28 పైసలు నష్టం వస్తుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ 28 పైసల్ని భరించనుంది. అంటే కేంద్రం రూ.1.86 ఇస్తే, రాష్ట్రం రూ.2.14 ఇస్తుంది. మొత్తంగా రైతులకు రూ.4 సబ్సిడీ అందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. నెల రోజుల్లో రైతుల ఖాతాల్లో నిధులు పడే అవకాశాలున్నాయి.

ప్రాసెస్ అయిపోయిన 3.25 లక్షల టన్నులు

ఇప్పటివరకు జిల్లాలో 3.25 లక్షల టన్నుల కాయల్ని ఫ్యాక్టరీలు, ర్యాంపులు కొనుగోలు చేయగా.. ఇంకా 15వేల టన్నుల కాయలు చెట్లకు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం ఏడు ఫ్యాక్టరీలు, తొమ్మిది ర్యాంపులు పనిచేస్తున్నాయి. సీజన్‌లో రోజుకు 10-11వేల టన్నుల కాయలు ప్రాసెస్ అయ్యేవి. ప్రస్తుతం సీజన్ ముగింపు దశలో రోజుకు వెయ్యి టన్నుల కాయలే ప్రాసెస్ అవుతున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో సీజన్ ముగిసే అవకాశం ఉంది. ఫ్యాక్టరీల్లో, ర్యాంపులు కాయల్ని అమ్మిన రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది రీవెరిఫికేషన్ చేస్తున్నారు.

కేంద్ర సాయం రూ.82 కోట్లు

జిల్లాలో ఇప్పటివరకు 3.25 లక్షల టన్నుల కాయలు ప్రాసెస్ అయ్యాయి. మరో 15వేల టన్నులు ఉన్నాయనుకుంటే మొత్తం 3.40 లక్షల టన్నుల కాయలకు సబ్సిడీ రానుంది. అంటే కిలో రూ.4, టన్నుకు రూ.4వేల చొప్పున 3.40 లక్షల టన్నుల కాయలకు రూ.136 కోట్ల సబ్సిడీ రైతులకు వస్తుంది. ఇందులో కేంద్రం టన్నుకు రూ.1860 చొప్పున ఇస్తే మొత్తంగా జిల్లాకు రూ.63.24 కోట్లు వస్తుంది. మిగిలిన రూ.72.76 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ భరించనుంది. ఇదే తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో కలిపి లక్ష టన్నుల కాయల్ని ప్రాసెసింగ్ చేయగా.. కేంద్రం రూ.18.60 కోట్లను, రాష్ట్రం రూ.21.40 కోట్లను రైతులకు అందించనుంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాకు కేంద్రం రూ.81.84 కోట్లను, రాష్ట్రం రూ.94.16 కోట్లను రైతులకు సాయం చేయనున్నాయి. తుది లెక్కలు వచ్చాక ఈ డబ్బులో స్వల్ప వ్యత్యాసం ఉండొచ్చు.

మామిడి రైతులకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్

అగ్రిగోల్డ్ భూముల మ్యుటేషన్ తక్షణం చేయండి

● అధికారులకు డీఆర్వో సూచన

7లో

ఆ సీసీపై విచారణ చేసి

నివేదిక పంపండి

● జడ్పీ సీఈవోకు పీఆర్ కమిషనర్ ఆదేశం

చిత్తూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ సీఈవో సీసీ, ప్రస్తుత పెద్దపంజాణి ఎంపీడీవో కార్యాలయ ఏవో సురేంద్రరెడ్డిపై విశ్రాంత ఎంపీడీవో కనకరాజులు నాయుడు సీఎంవోకు ఫిర్యాదు చేశారు. సురేంద్రరెడ్డి.. జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డికి సీసీగా ఉన్న సమయంలో ఉద్యోగుల ఎస్ఆర్‌లు దాచి పెట్టి ఇబ్బంది పెట్టాడని, జడ్పీ కార్యాలయంలోని అన్ని సెక్షన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. అనధికారికంగా మానిటరింగ్ చేశాడని, టైప్ రైటింగ్ పాస్ కాకుండానే ప్రమోషన్లు పొందాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై 15 రోజుల్లో విచారణ పూర్తి చేసి.. నివేదికను తనకు సమర్పించాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడిని పీఆర్ కమిషనర్ ఆదేశించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





మంత్రి బీసీ జనార్దనరెడ్డి - ప్రమోదదేవి, కృష్ణదత్త చామరాజ్ వడియార్ - స్వప్న దత్

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వేకువజాము సుప్రభాత సేవలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకోగా, ఉదయం వీఐపీ బ్రేక్‌లో దర్శనం చేసుకున్నవారిలో మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదదేవి, మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్, సినీ నిర్మాత స్వప్న దత్, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, ధన్‌పాల్ సూర్యనారాయణ ఉన్నారు. దర్శనం అనంతరం మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదదేవి, మహారాజు కృష్ణదత్త మీడియాతో మాట్లాడుతూ.. పల్లవోత్సవం సందర్భంగా తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తరతరాలుగా తమ వంశీకులందరూ స్వామి సేవలో తరిస్తున్నారని చెప్పారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

'దండోరా' చేస్తున్నా: నందు



తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నటుడు శివాజీతో కలిసి 'దండోరా' అనే చిత్రంలో నటిస్తున్నట్లు హీరో నందు తెలిపారు. శివాజీ తన తండ్రి పాత్రలో నటిస్తున్నారని వెల్లడించారు. తిరుమల శ్రీవారిని ఆయన మంగళవారం దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'అగ్లీ స్టోరీ' అనే మరో చిత్రంలోనూ నటిస్తున్నట్టు చెప్పారు. నిర్మాతగా తాను తీయబోతున్న చిత్రంలో పెద్ద హీరో నటిస్తున్నారని, ఆగస్టు మొదటి లేదా రెండవ వారంలో ఆ చిత్రానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.96 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,481

తలనీలాలు సమర్పించినవారు: 30,612

'నిసార్' సిద్ధం



ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన 'నిసార్' ఉపగ్రహం షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా ఈ నెల 30న ఎగిరేందుకు సిద్ధమైంది. రెండు రోజుల క్రితం షార్‌లోని శాటిలైట్ ప్రిపరేషన్ బిల్డింగ్ నుంచి ఉపగ్రహాన్ని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పచ్చజెండా ఊపి రెండో ప్రయోగ వేదిక వద్దనున్న వ్యాబ్‌కు తరలించారు. అక్కడ రాకెట్ మూడు దశల అనుసంధాన పనులు, రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఈ ఫొటోలను ఇస్రో మంగళవారం విడుదల చేసింది. మరో రెండు రోజుల్లో వ్యాబ్ నుంచి రెండో ప్రయోగ వేదికకు రాకెట్‌ను తరలించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



వాణిజ్య పన్నుల శాఖ
సర్కిల్ కార్యాలయం తరలింపునకు అనుమతి

తిరుపతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ శ్రీకాళహస్తి సర్కిల్ కార్యాలయాన్ని పుత్తూరు నుంచీ శ్రీకాళహస్తికి తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. శ్రీకాళహస్తి కేంద్రంగా పనిచేయాల్సిన సర్కిల్ కార్యాలయం పాలనా కారణాలతో పుత్తూరులో నడుస్తోంది. అక్కడి నుంచీ శ్రీకాళహస్తి పానగల్ ప్రాంతానికి కార్యాలయాన్ని తరలించేందుకు అనుమతి కోరుతూ శాఖ చీఫ్ కమిషనర్ ఈ ఏడాది ఫిబ్రవరి 28న లేఖ రాశారు. దానిపై స్పందించిన శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ కార్యాలయం తరలించేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కమనీయం కుమారస్వామి కల్యాణం



గజవాహనంపై ఊరేగుతున్న శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి

శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి కల్యాణం మంగళవారం రాత్రి కమనీయంగా సాగింది. శ్రీకాళహస్తి పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కుమారస్వామికి, శ్రీవల్లీ, దేవసేనకు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. అక్కడ నుంచి మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య కుమారస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో డిజిటల్ ఫైళ్లు !

తిరుపతి(నేరవిభాగం), జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఫైళ్ల నిర్వహణకు సంబంధించి పారదర్శకత ఎస్పీ హర్షవర్దన రాజు డిజిటల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో పోలీసు అధికారులు, పోలీసులు, సిబ్బందికి అవసరమైన పనులు ఎప్పటికప్పుడు సత్వరం పరిష్కరించడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. ఈ విధానం ద్వారా పోలీసు సిబ్బంది వారి వ్యక్తిగత ఫైళ్ల పురోగతిని సులభంగా తెలుసుకోవడానికి ప్రత్యేకంగా 9440900737 మొబైల్ నెంబరు ఏర్పాటు చేశారు. పారదర్శకత, దక్షణ, ఫైళ్ల పరిష్కారంలో వేగవంతం కోసం ఈ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఇంక్రిమెంట్లు, లీవులు, లీవు రెగ్యులరైజేషన్, జీపీఎఫ్ రుణాలు, అరియర్లు, ట్రాన్స్‌ఫర్లు, డెప్యుటేషన్లు, మెడికల్ రీఎంబర్సుమెంటు, భద్రత రుణాల మంజూరు తదితర విషయాల్లో తమకు సంబంధించిన ఫైళ్ళు ఎలా కదులుతున్నాయి? అనే సమాచారం సిబ్బందికి తెలియకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. డిజిటల్ వ్యవస్థతో ఫైల్ ప్రతి దశలో పురోగతిపై సమాచారం వాట్సాప్ ద్వారా ఆయా ఉద్యోగులకు అందుతుంది. అధికారులు, సిబ్బంది తమకున్న సమస్యలు, అభ్యంతరాలను మొబైల్ నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపొచ్చు. ఈ ప్రక్రియ మొత్తం జిల్లా పోలీసు అధికారి పర్యవేక్షణలో జరుగుతుంది.

ఆగస్టు 15నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలి

● పీ4 సర్వేపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం



తిరుపతి(కలెక్టరేట్), జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ4 తీసుకువచ్చారని వచ్చే 15కల్లా జిల్లాలో ఇచ్చిన లక్ష్యాని చేరుకోవాలని అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రభుత్వం పీ4ను తీసుకువచ్చిందని వివరించారు. ఆదాయంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించాలన్నారు. వీరిని ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నవారు దత్తత తీసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. పేదలకు సహాయ సహకారాలు అందించేందుకు మార్గదర్శకులుగా పేరు పెట్టడం జరిగిందన్నారు. ఆగస్టు 15 నాటికి జిల్లాలో పీ4 సర్వే పూర్తి కావాలన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఇక పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకూడా గడువులోగా పరిష్కరించాలని అర్జీదారులకు స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్ఎక్స్‌లో ఫోను పెడితే చాలు..!

● కొంటానంటూ వస్తాడు ● సోదరుడికి ఫోను చూపిస్తానంటూ పారిపోతాడు

● మళ్లీ ఫోను అమ్మకానికి పెట్టి పట్టుకున్న బాధితుడు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న యువకులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 22(ఆంధ్రజ్యోతి): ఓఎల్ఎక్స్ యాప్‌లో ఖరీదైన ఫోనును అమ్మకానికి పెడితే చాలు. నేను కొంటానంటూ ఫోను చేస్తాడు. నేరుగా కలిశాక మాయమాటలు చెప్పి.. ఇంట్లో చూపించి వస్తానంటూ ఆ ఫోనుతో పారిపోతాడు. అలాంటి మోసగాడిని.. ఓ బాధితుడే తన స్నేహితులతో కలిసి రెండు రోజుల కిందట పట్టుకున్నారు. ఇందులో బాధితుడు తిరుపతికి చెందిన సోని అయితే నిందితుడు విజయవాడవాసి సుబ్రహ్మణ్యం. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యం తిరుపతిలో ఉంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. పది రోజుల కిందట పద్మావతినగర్‌కు చెందిన సోని తన యాపిల్ ఫోన్‌ను విక్రయించడానికి ఓఎల్ఎక్స్ యాప్‌లో పెట్టారు. ఓఎల్ఎక్స్‌లో చూసిన సుబ్రహ్మణ్యం.. ఆ నెంబరుకు ఫోను చేశాడు. యాపిల్ ఫోన్ మొత్తం క్లియర్ చేసుకుని.. కొరమేనుగుంట వద్ద ఉన్న తన వద్దకు తీసుకొస్తే మాట్లాడి కొనుక్కొంటానని చెప్పాడు. ఆ ప్రకారం మొబైల్ ఫోన్ తీసుకుని సోని వెళ్లారు. ఈ ఫోన్ చూసిన సుబ్రహ్మణ్యం.. ఇదే అపార్టుమెంటులో ఉంటున్న తన సోదరుడికి చూపించి తీసుకొస్తానని చెప్పి వెళ్లాడు.రెండు గంటలైనా రాక పోయే సరికి అతడికి ఫోన్ చేశారు.తాను ఇక్కడే ఉన్నానని, వస్తానంటూ చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. చివరకు మోసపోయానని గుర్తించిన బాధితుడు.. తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎలాగైనా నిందితుడ్ని పట్టుకోవాలని..

ఖరీదైన ఫోన్ లాక్కెళ్లిన ఆ మోసగాడిని వదిలేయకూడదని సోని, అతడి స్నేహితులు భావించారు. అతడిని పట్టుకునేందుకు పథకం పన్నారు. మళ్లీ ఓఎల్ఎక్స్ యాప్‌లో యాపిల్ ఫోన్ విక్రయానికి ఉంచారు. దీనిపైనా స్పందించిన సుబ్రహ్మణ్యం.. ఆ ఫోన్ కొంటానంటూ ఆ నెంబరుకు సంప్రదించాడు. తాను ఓ కారు షోరూము వద్ద ఉన్నానని, అక్కడికి ఫోన్ తీసుకొస్తే చూసి కొనుక్కుంటానని చెప్పాడు. రెండు రోజుల కిందట సోనితో పాటు అతడి స్నేహితులు దాదాపు 10 మంది అక్కడకు వెళ్లారు. సోని దూరంగా ఉండగా.. మిగతా స్నేహితులు కథ నడిపారు. వీరి వద్ద ఫోను చూసి ధర ఎంత అని సుబ్రహ్మణ్యం అడగ్గా.. వారు రూ.1.5 లక్షలని చెప్పారు. దీనికి సరేనన్న సుబ్రహ్మణ్యం.. ఫోను ఇస్తే సోదరుడికి చూపించి వస్తానన్నాడు. ఆ వెంటనే వీరంతా మోసగాడిని పట్టుకున్నారు. తమ వాహనంలో తీసుకొచ్చి తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు అప్పగించారు. పోలీసుల విచారణలో సోని ఫోను ఎక్కడ అమ్మింది చెప్పాడు. ఆ ప్రకారం ఓ మొబైల్ షాపు వద్దకు వెళ్లి ఆ యాపిల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇలా, దాదాపు 20 నుంచి 30 ఐ ఫోన్లు లాక్కొని పరారైనట్లు సమాచారం.

9 లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు

● రూ.10 లక్షల కోట్లతో ఎంవోయూలు చేసుకున్నామన్న మంత్రి అనగాని



పండ్లు విక్రయిస్తున్న మహిళ సమస్యను తెలుసుకుంటున్న మంత్రి, ఎమ్మెల్యే

రేణిగుంట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులతో 9 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకున్నామని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం రేణిగుంటలోని అంబేడ్కర్ కూడలిలో జరిగిన 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. యువతకు ఉపాధి కల్పించే దిశగా తమ ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రణాళికతో ఎమ్మెల్యే సుధీర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించారని అభినందిస్తూ, ఇక్కడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, మురుగు నీటి కాలువలు కావాలని కోరారన్నారు. ఈ సమస్యలను మున్సిపల్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. గత పాలనలో ప్రజలకు ఏమి చేయకుండానే కూటమి మేనిఫెస్టోపై బురదజల్లేలా వైసీపీ ప్రచారం చేస్తోందని విమర్శించారు. గత పాలనలోలాగా రౌడీయిజం, అరాచకాలు లేకపోవడంతో శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతున్నారని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులుముని చంద్రారెడ్డి, మహబూబ్ బాషా, నేతలు సుబ్రహ్మణ్యం రెడ్డి, మునిస్వామి నాయుడు, నాదముని రెడ్డి, బుజ్జి నాయుడు, వెంకట మునిరెడ్డి, పుష్పనాదం, సుబ్రహ్మణ్యం, కన్నన్ రెడ్డి, రవి, రాజేష్ రెడ్డి, మేరీ, భాస్కర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, నవాబ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

'సమన్వయం'తో ముందుకెళతాం: ఎమ్మెల్యే



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమిప్రభుత్వంలో అంద రూ కలిసిఉండి నియోజకవర్గ సమన్వయకర్త శంకర్ రెడ్డితో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధివైపు నడిపిస్తామని ఎమ్మెల్యేకోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి కూడా అందరినీ విచారణచేసి కలుపుకొని వెళ్లమని చెప్పానే తప్ప ఆయనపై వ్యతిరేకత లేదన్నారు. వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎక్కడైనా పని ఇచ్చినా, ప్రోత్సహించినా విచారించి చర్యలు తీసుకోవచ్చన్నారు. 17 నెలలుగా ప్రతిరోజు తనను మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. అన్ని అవమానాలను తట్టుకుని పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సత్యవేడు మండలంలో ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఒకరు వానెల్లూరు పంచాయతీ సమీపంలో ర్యాంప్ ఏర్పాటు చేసి ఏడాదిగా రాత్రిసమయంలో క్వారీల ముసుగులో శ్రీసిటీ పోలీస్‌స్టేషన్ మీదుగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిందన్నారు. వాటిపై విచారించకుండా అనుమానాస్పదంగా కేసు కడుతున్నారన్నారు. ఆ అధికారి ఎంతకు దిగజారాడో తెలుస్తోందన్నారు.

సైదాపురం పూర్వపు ఎంపీడీవోపై వేటు

● ఉపాధి హామీ పథకంలో అవినీతే కారణం

● ప్రస్తుతం కోట మండల పరిషత్ ఏవో

సైదాపురం/కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సైదాపురం పూర్వపు ఎంపీడీవో.. ప్రస్తుతం కోట మండల పరిషత్ కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న పి.శివకుమార్‌ను సస్పెండ్ చేసినట్లు జడ్పీ సీఈవో మోహన్ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైదాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సమయంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సిబ్బంది వద్ద నగదు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు పూర్తిస్థాయిలో విచారించిన ఉన్నతాధికారులు వాస్తవమని తేలడంతో ఆయ న్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● 247 నుంచి 358కి

తిరుపతిలో పెరగనున్న పోలింగ్ కేంద్రాలు

తిరుపతి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నిక కమిషన్ మార్గదర్శకాలనుసారం తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి. ఇప్పటి వరకు 109 ప్రాంతాల్లో 274 పోలింగ్ కేంద్రాలు ఉండగా... 126 ప్రాంతాల్లో 358కి కేంద్రాలు పెంచేలా చర్యలు చేపట్టామని అర్బన్ తహసీల్దారు సురేష్‌బాబు మంగళవారం మీడియాకు తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1,200ఓట్లకే పరిమితం చేశామన్నారు. అనివార్య కారణాల దృష్ట్యా 13ప్రదేశాలు మార్పు జరిగిందని, 2 పోలింగ్‌స్టేషన్ల పేర్లు సవరణ చేశామన్నారు. ఈ నివేదికను 25న కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. త్వరలోనే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ డోర్ టూ డోర్ సర్వే చేపడుతామన్నారు. తద్వారా కుటుంబ సభ్యులందరు ఒకే పీఎస్‌లో ఓటు వేసేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

శ్రీవాణి ట్రస్టు భక్తులకు నూతన భవనం



కౌంటర్లు ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో, అధికారులు

తిరుమల, జూలై22(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేసేందుకు తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా ఉన్న నూతన కేంద్రాన్ని మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించాక కొందరు భక్తులకు టికెట్లను జారీ చేశారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవాణి టికెట్ల కోసం భక్తులు ఉదయం 5 గంటల నుంచే క్యూలైన్‌లో నిలబడుతున్నారని, ఈ నేపథ్యంలో భక్తులకు సులభతరంగా టికెట్లు జారీ చేసేందుకు రూ.60 లక్షలతో నూతన కౌంటర్లను నిర్మించామన్నారు. బుధవారం నుంచి ఈ కౌంటర్ల ద్వారా భక్తులకు టికెట్లు జారీ చేస్తామన్నారు. అనంతరం హెచ్‌వీసీ, ఏఎన్సీ ప్రాంతాల్లో ఆధునికీకరించిన ఉప విచారణ కార్యాలయాలను టీటీడీ చైర్మన్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, జంగా కృష్ణమూర్తి, భానుప్రకాష్‌రెడ్డి, శాంతారామ్, నరేష్, సదాశివరావు, నర్సిరెడ్డి, జానకీదేవి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం

● టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మంచు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మంచు లక్ష్మి

నాయుడుపేట టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ కృషి చేస్తోందని ఫౌండేషన్ చైర్‌పర్సన్, సినీ నటి మంచులక్ష్మి పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణం రాజగోపాలపురం ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూంను మంగళవారం మంచు లక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 320 డిజిటల్ క్లాస్ రూంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ అమ్మమ్మ ఊరైన నాయుడుపేట ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ రూంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అంతకుముందు నాయుడుపేటలో ఉన్న తన తల్లి సమాధి వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఈవో సనత్‌కుమార్, ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయుడు జనార్దనరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, మాజీ కౌన్సిలర్ శేషం మునిగోపి, టీడీపీ నాయకులు పెనల కిషోర్‌బాబు, నానాబాల సుబ్బారావు, అవధానం సుధీర్, సాయి, సురేష్, మస్తాన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఆరేళ్ల ఎదురుచూపు

● వెటర్నరీ వర్సిటీ అధ్యాపకులకు బకాయిల విడుదల

తిరుపతిరూరల్, జూలై22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్సిటీ పరిధిలోని అధ్యాపకుల ఆరేళ్ల ఎదురుచూపు ఫలించింది. యూజీసీ అరియర్స్ విడుదలయ్యాయి. ఈ మేరకు యూజీసీ-2016 రివైజ్డ్ పే స్కేల్ అరియర్స్‌లో రాష్ట్రప్రభుత్వ వాటా 50శాతానికి సంబంధించిన రూ.12.78కోట్లను విడుదల చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అదనపు బడ్జెట్‌లో యూజీసీ రెగ్యులర్ అధ్యాపకులకు రాష్ట్రప్రభుత్వ 50శాతం, పెన్షనర్స్‌కి వందశాతం మంజూరు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. యూజీసీ ఆర్పీఎస్ -2016 ప్రకారం అప్పట్లో అధ్యాపకులకు పెరిగిన వేతనాలను రాష్ట్రంలో 2019 ఏప్రిల్‌నెల నుంచి ఇంప్లిమెంట్ చేశారు. దీనికి సంబంధించి 2016జనవరి1 నుంచి 2019మార్చి 31వరకూ వర్సిటీ అధ్యాపకులకు బకాయిలు చెల్లించని పరిస్థితి. దీనిలో రాష్ట్రప్రభుత్వ వాటా 50శాతానికి ఐసీఏఆర్ మ్యాచింగ్‌గ్రాంట్ 50శాతం వాటా కలుపుకుని అధ్యాపకులకు వందశాతం అరియర్స్‌ని చెల్లించాలి. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ 50శాతం వాటాన్ని వర్సిటీ బడ్జెట్‌లో చూపిన తర్వాతనే మ్యాచింగ్ గ్రాంట్ 50శాతాన్ని విడుదల చేస్తామని ఐసీఏఆర్ అధికారులు సూచించారని సమాచారం. ఆ క్రమంలో రాష్ట్రప్రభుత్వ వాటాకి సంబంధించి వర్సిటీలో బడ్జెట్‌లో నిధులులేని కారణంగా ఐసీఏఆర్ మ్యాచింగ్ గ్రాంట్ వాటా నిధులు ఇవ్వకుండా ఇన్నేళ్లు తాత్సారం చేశారని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. గతవైసీపీ ప్రభుత్వ పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ఆరేళ్లుగా అరియర్స్ కోసం ఎదురుచూడాల్సి వచ్చిందని అంటున్నారు. ఇక ఐసీఏఆర్ మ్యాచింగ్‌గ్రాంట్ నిధులను తెచ్చుకోవాల్సి ఉందని అంటున్నారు.

మామిడి రైతులకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, వేదికపై ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు సెంట్రల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మామిడి రైతులకు న్యాయం చేస్తామని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్ తెలిపారు. జాతీయ మామిడి దినోత్సవం సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం కన్వీనర్లు ఆనందనాయుడు, జనార్ధన్ అధ్యక్షతన మంగళవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో మామిడి రైతు మహా జన సభ నిర్వహించారు. ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్ మాట్లాడుతూ.. మామిడి రైతులకు అన్నిరకాలుగా న్యాయం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఇందులో భాగంగానే తోతాపురి మామిడి కాయలకు కిలో రూ.12 మద్దతు ధరను ప్రకటించిందని చెప్పారు. ఇందులో కిలోకు రూ.4 చొప్పున రూ.260 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. మిగిలిన ఎనిమిది రూపాయలను ఫ్యాక్టరీలు, ర్యాంపుల యాజమాన్యాల నుంచి రైతులకు చేరేలా చర్యలు తీసుకుంటామని, ఈ మొత్తాన్ని ఇచ్చే ఫ్యాక్టరీలను మాత్రమే రన్ చేయిస్తామని స్పష్టం చేశారు. ఫ్యాక్టరీలు ఇకపై సిండికేట్ కాకుండా చూసేందుకు రైతుల ద్వారా చిన్న ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయించే బాధ్యత తీసుకుంటామన్నారు. అవసరమైతే తానే ఒక ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తానన్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నుంచి రైతులు ఇబ్బంది పడకుండా గుజ్జు పరిశ్రమలను సహకార రంగంలోనూ తీసుకొచ్చేలా అసెంబ్లీలో ప్రస్తావిస్తానని చెప్పారు. టీటీడీ, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో మామిడి ఉత్పత్తులను ఉపయోగించేలా కృషి చేస్తానన్నారు. ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గుచూపాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, నాయకులు చంద్రప్రకాష్, హరిబాబు, రామానాయుడు, హేమలత, భాస్కర్‌నాయుడు, మామిడి రైతులు పాల్గొన్నారు.

● నూతన కమిటీ ఏర్పాటు

ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్.ఆనందనాయుడు, అధ్యక్షుడిగా టి.జనార్ధన్, ప్రధాన కార్యదర్శిగా ఏకే హరిబాబు చౌదరి, కోశాధికారిగా పీఎల్ సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులుగా మునీశ్వరరెడ్డి, పి.భారతి, బి.మురళి, కె.మునిరత్నం నాయుడు, వి.ఉమాపతినాయుడు, కార్యదర్శులుగా ఎం.లవకుమార్, టీకే చంద్రమౌళిరెడ్డి, వి.సందీప్, కె.సురేంద్ర, కె.హరిబాబు ఎంపికయ్యారు.

అక్రమంగా తరలిపోతున్న గ్రానైట్

పట్టించుకునే వారేరి?



పలమనేరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద మొరాయించిన గ్రానైట్ దిమ్మెలను తరలిస్తున్న లారీని వెనుక్కు లాగుతున్న ఎక్స్‌కవేటర్

పలమనేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని చెన్నై హార్బర్‌కు గ్రానైట్ అక్రమంగా తరలిపోతోందన్న విమర్శలొస్తున్నాయి. పైగా గ్రానైట్ తరలించే లారీలకు పలమనేరు గేటవేగా మారిందని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున కూడా తమిళనాడుకు వెళుతున్న ఓ భారీ లారీ పలమనేరు అంబేడ్కర్ సర్కిల్ వద్దకు రాగానే మొరాయించింది. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండని అప్పటి కప్పుడు ఒక ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి ఆ లారీని రోడ్డుకు అడ్డులేకుండా వెనక్కు తీయించారు.

చీకటిపడగానే..

రోజూ చీకటి పడగానే కనీసం 20 నుంచి 40 లారీలు పలమనేరు మీదుగా వెళ్తున్నాయి. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలనుంచే కాక మదనపల్లె, పుంగనూరు, పీలేరు, ప్రాంతాల నుంచి కూడా గ్రానైట్ తరలిపోతోంది. పరిమితికి మించి భారీ లారీల్లో గ్రానైట్ దిమ్మెలు నింపి అవి కనిపించకుండా పార్శిళ్లను తలపించేలా వాటిపై పట్టలు కప్పి ఉంచుతున్నారు. పలమనేరు నుంచి తమిళనాడులోని గుడియాత్తం, మీదుగా పళ్లికొండ వరకు వెళ్లి అక్కడినుంచి జాతీయ రహదారి మీదుగా చెన్నై వెళ్తున్నాయి. విదేశాల్లో రాయలసీమ పరిధిలోని గ్రానైట్‌కు మంచి ధర పలుకుతుండటంతో అక్రమార్కులు ఈ దందా ఎంచుకున్నట్లు సమాచారం.

అడ్డుకునే వారేరి?

పలమనేరు నుంచి గుడియాత్తం వరకు ఉన్న రహదారి పూర్తిగా అటవీప్రాంతంలో ప్రమాదకర మలుపులతో కూడిన ఘాట్‌రోడ్డు. ఈ రహదారిపై సైనిగుంట వద్ద మాత్రమే అటవీ, మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులున్నాయి. అయినా అక్కడి సిబ్బంది ఎవరూ అడ్డుకోవడం లేదన్న విమర్శలున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి లక్షలాదిరూపాయల ఆదాయం గండిపడుతోంది. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్రిగోల్డ్ భూముల మ్యుటేషన్ తక్షణం చేయండి

● అధికారులకు డీఆర్వో సూచన



సమావేశంలో సూచనలిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అగ్రిగోల్డ్‌కు సంబంధించిన స్థిరాస్తులను వెంటనే మ్యుటేషన్ చేయాలని డీఆర్వో మోహన్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్లో మంగళవారం అగ్రిగోల్డ్ భూములకు సంబంధించి జరిగిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. చిత్తూరు, పలమనేరు మున్సిపాలిటీలు, వికోట, వరాల మండలాల్లో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తుల స్థితిగతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులకు సంబంధించి భౌతిక ధ్రువీకరణ పూర్తిచేసుకుని రికార్డులు సిద్ధంచేసుకోవాలని సూచించారు. వాటి రిజిస్ట్రేషన్ విలువ, మార్కెట్ విలువలను గుర్తించాలని జిల్లా రిజిస్టార్ మూర్తికి సూచించారు. ప్రస్తుత అగ్రిగోల్డ్ భూముల పరిస్థితి ఏమిటి? ఆక్రమణలు, కోర్టుకేసు వివాదాలు తదితర అంశాలన్నిటినీ పరిశీలించాలని, వ్యవసాయ భూముల మ్యుటేషన్ ప్రక్రియను గురువారంలోగా పూర్తిచేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. మ్యుటేషన్ పూర్తయ్యాక ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు చేపడతామన్నారు. తిరుపతి డీఎస్పీ రసూల్ సాహెబ్, జిల్లా రిజిస్టార్ కార్యాలయ ప్రతినిధి రామ్మెప్రసాద్, వ ఆంఎ్ వేకీ ఈ డీఓ వేలాయుధం, పలమనేరు, చిత్తూరు మున్సిపల్ కమిషనర్లు ఎస్.వి.రమణారెడ్డి, నరసింహప్రసాద్, తహసీల్దార్లు లోకేశ్వరి, ఉదయ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలోనూ టీటీడీ పరిపాలన భవనం

● 142 మంది కాంట్రాక్ట్ డ్రైవర్ల క్రమబద్ధీకరణ

● బోర్డు నిర్ణయాలను వెల్లడించిన టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొత్తగా పరిపాలన భవనం నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. తిరుమలలో ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉన్న వివిధ విభాగాలను ఒకే తావులోకి తీసుకురావడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం తెలిపారు. అలాగే ఏపీ హైకోర్టు తీర్పు మేరకు టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్లుగా పనిచేస్తున్న 142 మందిని క్రమబద్ధీకరించేందుకు తీర్మానం చేశామని, దీనిని ప్రభుత్వ ఆమోదం కోసం పంపుతామని చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశ వివరాలను ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి చైర్మన్ మీడియాకు వివరించారు. బోర్డు నిర్ణయాల్లో కొన్ని ఇవీ.

- ఒంటిమిట్టలోని భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు రూ.4.35 కోట్లు కేటాయింపు.
- శ్రీవారిమెట్టు, అలిపిరి నడకమార్గాల్లో లైటింగ్, భద్రత పెంపు. ఆధ్యాత్మిక ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు.
- శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్, డీపీఆర్ రూపొందించాలని ఆదేశం.
- వివిధ దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక పై టీటీడీ సబ్ కమిటీ ఏర్పాటు. ఆ కమిటీ నివేదిక ప్రకారం తదుపరి చర్యలు.
- శ్రీవారిసేవను మరింత పటిష్టంగా అమలుచేసేందుకు కాంట్రాక్టు విధానంలో 4 కోఆర్డినేటర్ పోస్టుల భర్తీ.
- కల్యాణకట్టలో మరింత మెరుగైన వసతుల కోసం నిపుణులను సంప్రదించి కార్యాచరణ ప్రణాళిక.
- తిరుమలలో పాతబడి హెచ్‌వీడీసీలోని ఆరు బ్లాకులు, బాలాజీ విశ్రాంతి భవనం, ఆంధ్రా గెస్ట్‌హౌస్, అన్నపూర్ణ క్యాంటీన్, కల్యాణి సత్రాలను వాటి నిపుణుల సూచనల మేరకు తొలగించాలని నిర్ణయం.
- వేదపారాయణం స్కీం ద్వారా ఇప్పటికే 1,430 మందికి ఏటా రూ.36 కోట్ల గౌరవ వేతనం ఇస్తున్నారు. తాజాగా మరో 700 మందికి ఇవ్వాలని నిర్ణయం. దీనివల్ల టీటీడీకి అదనంగా రూ.18 కోట్ల భారం పడుతుంది. రాష్ట్రంలోని వారికే తొలి ప్రాధాన్యం.
- కడపలోని పురాతనమైన శివాలయం అభివృద్ధి.
- తాళ్లపాకలో పలు అభివృద్ధి కార్యక్రమాలు.

ఆచూకీ చెబితే రూ.5లక్షలు



వరదయ్యపాళెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం ఆరంబాకంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ.5లక్షలు బహుమానం ఇస్తామని గుమ్మిడిపూడి డీఎస్పీ జయశ్రీ తెలిపారు. నిందితుడి గాలింపు చర్యల్లో భాగంగా సత్యవేడు, వరదయ్యపాళెం, తడ మండలాల్లో మంగళవారం డీఎస్పీ పర్యటించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించామన్నారు. నాలుగు బృందాలు నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఆమె తెలిపారు.

అడవుల్లో సోలార్ రిఫ్లెక్టర్ లైట్లు

(5వ పేజీ తరువాయి)

చేసిందన్నారు. ఒక్కో యూనిట్ ధర రూ.12,500 కాగా.. తొలి దశలో పది లైట్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. కల్లూరు, దేవళంపేట, కొటపల్లె, జూపల్లె, సైనిగుంట, కమ్మపల్లెల్లో ఏనుగులు, అటవీ జంతువుల ఎక్కువగా సంచరించే ప్రాంతాలను గుర్తించినట్టు చెప్పారు. ఈ ప్రాంతాల్లో తెలుపు లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సోలార్ రిఫ్లెక్టర్ లైట్ల నుంచి వెనుదిరిగే ఖబ్లుకోపాటు తెల్లటి రంగులో వెలుతురు వస్తుందని, వీటి కిరణాలు ఏనుగుల వద్దకంటే జంతువులు అటువైపుగా రావడానికి వెనకడతాయన్నారు. ఆధునాతన సాంకేతిక విధానంలో రూపొందించిన లైటలో ఖబ్లుతోపాటు లైట్స్ ఆఫ్ అండ్ ఆన్, రొటేషన్ పద్ధతిలో వీటిని వాడుకునే సౌలభ్యం ఉందన్నారు.



కంపెనీల ప్రతినిధులతో ఎమ్మెల్సీ కంచర్ల, కడా పీడీ వికాస్ మర్మత్ తదితరులు - జాబ్ మేళాకు హాజరైన యువతీ యువకులు



కుప్పంలో సీఎం 'ఉపాధి' యజ్ఞం!

● జాబ్ మేళాలో ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో యువతకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఉపాధి' యజ్ఞం చేస్తున్నారని ఎమ్మెల్సీ కడా నలహామండలి అధ్యక్షుడు కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం (పీఎస్ఎం) అన్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా), 1ఎం1బీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కడా కార్యాలయ ఆవరణలో మంగళవారం భారీ జాబ్ మేళా నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమానికి హాజరైన కంచర్ల, పీఎస్ఎం ప్రసంగించారు. కుప్పం యువత ఒకప్పుడు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకోసం పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్లేవారన్నారు. దీన్ని నివారించడానికి 2024లో చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక యువతకోసం కడా ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేటు ఏజన్సీల భాగస్వామ్యంతో ఉద్యోగ, ఉపాధి కల్పనకు తెరతీశారని చెప్పారు. ఇదివరకు నిర్వహించిన ఉద్యోగ మేళాలో సుమారు 600 మంది ఉద్యోగాలు పొందారని గుర్తు చేశారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో పలు పరిశ్రమలు స్థాపిస్తున్నామని, ఇందులో కూడా ఉద్యోగావకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ.. జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కడా సలహా మండలి సభ్యులు డాక్టర్ బీఆర్ సురేష్‌బాబు, రాజ్ కుమార్, నరేశ్, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

500 మందికిపైగా ఉద్యోగావకాశాలు

జాబ్‌మేళాలో 500 మందికి పైగా ఎంపికై యువకులు ఉద్యోగావకాశాలు పొందారు. వీరికి ఐటీ, ఫార్మా, రిటైల్, హెల్త్ కేర్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలకు చెందిన సుమారు 50కిపైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం, కలెక్టర్ సుమిత్‌కుమార్ నియామకపత్రాలను అందజేశారు.

ప్రతి కేసును మానవీయకోణంలో చూడాలి

● ఉమెన్ సేఫ్టీ ఐజీపీ రాజకుమారి

చిత్తూరు అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల మిస్సింగ్, ప్రేమ వివాహాలు, కుటుంబ సమస్యలతో వచ్చేవారి కేసులను మానవీయ కోణంలో చూసి పరిష్కార మార్గం చూపాలని అనంతపురం రేంజ్ ఉమెన్ సేఫ్టీ ఐజీపీ రాజకుమారి సూచించారు. మంగళవారం ఆమె మహిళల భద్రతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్పీ మణికంఠ, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక నేరాలపై నమోదైన కేసులకు సంబంధించి 60 రోజుల్లోపు చార్జిషీట్ వేయాలన్నారు. లైంగిక నేరాల చరిత్ర కలిగిన వ్యక్తులపై రౌడీషీట్లు తెరవడంపై దృష్టి పెట్టాలన్నారు. మహిళలపై నేరాలు, వేధింపుల వంటి అంశాలపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శక్తి వారియర్స్ నదస్సులను నిర్వహించాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్పీలు, సీఐలు, మహిళా ఎస్ఐలు పాల్గొన్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలపై ఎస్పీ జిల్లాలోని పోలీసులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి.. స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

బ్యూటీషియన్, రీటైల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరురూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత బ్యూటీషియన్, రీటైల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి దొణప్ప ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిలైన 18-35 ఏళ్లలోపున్న స్త్రీ, పురుషులు బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరవ్వాలన్నారు. కోర్సు పూర్తయిన వారికి తామే ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 83286 77983, 76710 66532 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రజారోగ్యంపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ సుమిత్‌కుమార్



రాళ్లబూదుగూరు పీహెచ్‌సీలో రోగుల ఆన్‌లైన్ సేవలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

శాంతిపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం శాంతిపురం, రాళ్లబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో రోగుల ఆన్‌లైన్ సేవలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని భూసమస్యలపైన 'హుసీల్దార్ శివయ్య, రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. రైతులు, ప్రజలను ఇబ్బంది పెట్టకుండా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. విమానాశ్రయం భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోకులం పెద్ద నిర్మాణాలకు బిల్లులు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు బాహ్యం విశ్వనాథనాయుడు కలెక్టర్‌కు విన్నవించారు. త్వరలోనే బిల్లులు మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే మండలంలోని పలు పాఠశాలలకు ప్రహరీలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తారురోడ్లు మంజూరు చేయాలని కోరారు. ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, వైద్యాధికారి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో ఆలయ సిబ్బంది చేతివాటం

రూ.47వేలను స్వాహా చేసిన ఆరుగురి సస్పెన్షన్ ● ఆలస్యంగా వెలుగులోకి..



బోయకొండ గంగమ్మ ఆలయం

చౌడేపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో రూ.47వేలను స్వాహా చేసిన ఆరుగురు ఆలయ సిబ్బందిని సస్పెండ్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బోయకొండలో అమ్మవారికి భక్తులు జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. అమ్మవారికి బలిచ్చిన పొట్టేలు తలలు ప్రైవేటు వ్యక్తులకు టెండర్ ద్వారా సుమారు రూ.80లక్షలకు మార్చిలో ఏడాది పాటు సేకరించి విక్రయించుకునే హక్కును కల్పించారు. అలాగే భక్తులు పొట్టేలు బలి ఇవ్వడానికి ఆ ఏడాది కొత్తగా ఆలయ అధికారులు రూ.200 టికెట్టును ప్రవేశపెట్టారు. ఏప్రిల్ ఒకటో తేదీనుంచి ఆలయ అధికారులు నూతనంగా ప్రవేశపెట్టిన టిక్కెట్‌ను వసూళ్ల చేసేందుకు ఆలయ సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఈక్రమంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి రూ.47వేలను స్వాహా చేశారని గుర్తించారు. దీనివెనుకున్న ఆలయ ఉద్యోగితో పాటు ఓ కాంట్రాక్టు ఉద్యోగి, మరో నలుగురు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని గుర్తించి ఈవో ఏకాంబరం నాలుగురోజుల క్రితం సస్పెండ్ చేశారు. అలాగే వారిపై పోలీసులకు ఫిర్యాదు అందించారు. అయితే విషయం బయటకు రాకుండా ఆలయ అధికారులు గోప్యంగా ఉంచారు. కొంతమంది సిబ్బంది ఏళ్లతరబడి పాతుకుపోవడంతో కింగ్ మేకర్లుగా మారి ఆలయ అధికారులను సైతం మాయచేసి దోచేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. విజిలెన్స్ ఉన్నతాధికారులు ఆలయ రికార్డులు తనిఖీలు చేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ప్రజాప్రతినిధుల జాతీయ సదస్సు

● నేడు తిరుపతి కలెక్టరేట్‌లో అధికారులతో స్పీకర్ సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా చట్టసభల జాతీయ మహిళా సాధికార సభ్యుల సదస్సు సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరగనుంది. ఈ సదస్సుకు విదిధరాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 10గంటలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్షించనున్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులు పాల్గొననున్నారు. జాతీయ మహిళా సాధికార సభ్యుల సదస్సు కోసం తాజ్‌హోటల్‌ను వేదికగా ఎంచుకున్నట్టు సమాచారం. దాదాపు 500మంది ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ కమిటీ సభ్యులు అన్ని రాష్ట్రాల నుంచి పాల్గొంటున్నారు.

బీటెక్ ఫలితాలలో కేఈసీ విజయం



బీటెక్ ఫలితాలు విడుదల చేస్తున్న బీసీ.నాగరాజ్ తదితరులు

కుప్పం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్) మే, జూన్ నెలలో నిర్వహించిన బీటెక్ ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరీక్షా పరిశీలకులు ప్రొఫెసర్ డాక్టర్ వీబీ చిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, హ్యూమానటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి జె.మాధవన్, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ఎం.సోమసుందరం మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ బీటెక్ ద్వితీయ సెమిస్టర్‌లో కేఈసీ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ఫలితాల సాధనలో విజయం సాధించినట్లు చెప్పారు. ద్వితీయ సెమిస్టర్ పరీక్షల్లో ఎస్.బ్రాహ్మిణి 94. శాతం, కసిరెడ్డి రక్షిత 93.8, కొట్టే వాగ్దేవి 92.9 శాతం మార్కులతో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందినట్లు పొందారు. అలాగే అత్యధిక శాతం విద్యార్థులు డిస్టింక్షన్, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులను నాగరాజ్ అభినందించారు. కార్యక్రమంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్, కార్యదర్శి ఎన్.సాగర్ రాజ్, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



బోరు యంత్రానికి పూజలు చేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మోట్లచేను పంచాయతీ, కొత్తచేను గ్రామంలో నూతన బోరుకు ఆయన మంగళవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, మోహన్, శివ, యతిరాజులు, విభూషణ్, వెంకటేశ్, గుణశేఖర్, అనుచక్రవర్తి, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి బాలమురుగన్ ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు



కుంభాభిషేక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

రామకుప్పం, జూలై 22(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల పంచాయతీ పాలరేవుగడ్డలోని బాలమురుగన్ ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు ఈనెల 29 నుంచి 31వరకు నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి తెలిపారు. మంగళవారం వారు రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన వివిధ గ్రామాల పెద్దలతో కలిసి కుంభాభిషేక కరపత్రాలు ఆవిష్కరించారు. 29, 30 తేదీల్లో వివిధ రకాల హోమాలు, పూజలు జరుగుతాయన్నారు. 31న తెల్లావారుజామున ఆరోహణం, బింబనం, నేత్రోన్మీలనం, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 8 గంటలకు వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, వినాయకుడు, నవగ్రహ, దక్షిణామూర్తి, పార్వతీదేవి, బాలమురుగన్ కొత్త విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 10.30 గంటలకు విమాన గోపుర కలశస్థాపన, కుంభాభిషేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కుంభాభిషేక మహోత్సవాల సందర్భంగా మూడు రోజులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నిస్వార్థ సేవలతోనే గౌరవం



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు

కల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించే నిస్వార్థ సేవలతోనే సమాజంలో గుర్తింపు.. గౌరవం ఉంటుందని ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమనాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి సచివాలయంలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన సిబ్బందికి మంగళవారం సచివాలయంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించే సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకం కావాలన్నారు. అప్పుడే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. అనంతరం బదిలీ అయిన సిబ్బంది శ్రీబాబు, గౌతమి, రవితేజ, రిజ్వాన్, ఉదయశ్రీ, ప్రియ, షాక్రున్‌లను శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపినాయుడు, శంకర్, దేవ, జయచంద్రనాయుడు, సురేంద్ర, పరంధామనాయుడు, పార్థసారథి నాయుడు, బాలాజీ, తేజ, ప్రకాష్ పాల్గొన్నారు.

జిల్లా బీజేపీ కార్యవర్గంలో రొంపిచెర్ల వాసులకు అవకాశం



ఇందిర, వెంకట్రామనాయుడు

రొంపిచెర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పుంగనూరు నియోజకవర్గం రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన వెంకట్రామ నాయుడు జిల్లా పార్టీ కార్యదర్శిగాను, కల్లావారిపల్లెకు చెందిన ఎం.ఇందిర కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నికైనట్లు రొంపిచెర్ల మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజ తెలిపారు. ఈమేరకు మంగళవారం వారు జిల్లా పార్టీ అధ్యక్షుడు జగదీశ్వరనాయుడుచే నియామక పత్రాలు తీసుకున్నారు.

జర్మనీ భాషపై బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు శిక్షణ

పుంగనూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ చదివిన ఎస్సీ, ఎస్టీ బాలికలకు జర్మనీ భాష నేర్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం 8 నెలలపాటు తిరుపతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు పుంగనూరు ఎస్సీ హాస్టల్ వార్డెన్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి 35 ఏళ్ల వయస్సు లోపు అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం సర్టిఫికెట్లు, క్లినికల్ అనుభవం, ఏపీ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, కులం ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధారు కార్డులు జత చేయాల్సి ఉందన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

పలమనేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపల్ పరిధిలోని పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి జె.రామచంద్రయ్య డిమాండు చేశారు. మంగళవారం పలమనేరు మున్సిపల్ బాపూజీ ఉద్యానవనంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాకు తగిన సంఖ్యలో పారిశుధ్య కార్మికులు లేనందున పనిభారంతో అవస్థలు పడుతున్నారని, కిందిస్థాయి ఉద్యోగులు పారిశుధ్య కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ట్రాక్టర్లు సకాలంలో రాకపోవడంతో చెత్తపోయడానికి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో పలమనేరు ఏఐటీయూసీ నాయకులు చెన్నకేశవులు, బుర్ర మంజునాథ్, రామ్మూర్తి, రమేష్, యూనియన్ నాయకులు చిన్నబ్బ, చంద్రయ్య, బాబు, నాగరాజు, శ్రీనివాసులు, సురేష్, మహేష్, విజయమ్మ, అరుణ, గంగమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్



ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న గౌనివారి విజయ్‌కుమార్

వి.కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా వి.కోట మండలం కొంగాటంకు చెందిన గౌనివారి విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్షులు జగదీశ్వరనాయుడు చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను ఆయన అందుకున్నారు. గతంలో వి.కోట మండల పార్టీ అధ్యక్షులుగా, పలమనేరు అసెంబ్లీ కన్వీనర్‌గా పదవులు నిర్వర్తించిన ఆయన్ను జిల్లా కార్యదర్శిగా నియమించడంపై పలువురు బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

సోమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సూరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు పాఠశాల ఆవరణలో మంగళవారం హెచ్‌ఎం శిరీష అధ్యక్షతన సన్మానం చేశారు. ఈ సందర్భంగా పూర్వ హెచ్‌ఎం నిరంజన్ కుమార్, ఉపాధ్యాయులు విద్యావతి, సూర్యప్రకాశ్‌లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కుసుమ, షర్మిళ భాను, చంద్రకళ, రాజేశ్, పీడీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కందూరులో గణిత అష్టావధానం



అష్టావధానంలో పాల్గొన్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి

సోమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కందూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత అష్టావధాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గణిత ఉపాధ్యాయులచే అరుణ శివప్రసాద్ అష్టావధానం చేపట్టారు. మండలంలోని పలువురు గణిత ఉపాధ్యాయులు పై డే ప్రాధాన్యతను వివరించారు. హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి ఉపాధ్యాయులను సన్మానించారు. షకీల్, దేవిక, వాసు, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టుపై నిరసన

వి.కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని మద్యం స్కాంలో అరెస్టు చేయడంపై వైసీపీ మండల కన్వీనర్, ఎంపీపీ యువరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం వి.కోటలో నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. వైస్ ఎంపీపీ తమీంఖాన్, లక్ష్మణ్‌రెడ్డి, నేతలు గౌస్, పీఎస్ లక్ష్మీ, గోపిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అమర్‌నాథ్, కుమార్ రాజా, మోహన్‌రాజ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

సోమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో మూడు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. సోమవారం అర్ధరాత్రి సోమల-కందూరు మార్గంలోని పాలేటమ్మ వారి ఆలయం సమీపంలో సదుం మండలం సీఎం గొల్లపల్లెకు చెందిన ఎస్.ప్రసాద్ భార్య ముత్యాలమ్మతో కలిసి పాలేటమ్మ జాతరకు ద్విచక్రవాహనం లో వస్తున్నారు.ఇదే క్రమంలో సోమల మండలం గురికానివారిపల్లెకు చెందిన వై. సోమశేఖర్ ద్విచక్రవాహనంలో జాతర నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ప్రకాశ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను వేలూరు సీఎంసీ వైద్యశాలకు తరలించారు. ముత్యాలమ్మ ఫిర్యాదులతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివశంకర తెలిపారు. అలాగే సోమవారం రాత్రి సోమల - చౌడేపల్లె మార్గంలోని నడింపల్లె క్రాస్ రోడ్డులో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో పార్వతీపురానికి చెందిన ప్రకాశ్, రామయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం నడింపల్లె పంచాయతీ కరకమంద వద్ద మామిడి కాయల లోడ్డుతో వస్తున్న ట్రాక్టర్ రోడ్డు పక్కనే ఆవులతో ఇంటికెళ్తున్న గౌస్‌బాషాను (కరకమందకు చెందిన) ఢీకొంది. ప్రమాదంలో గౌస్‌బాషా తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని తిరుపతి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

కోదండ రామాలయానికి
రూ.7.80 కోట్ల మంజూరు

● కలెక్టర్ సుమిత్‌కుమార్



రాళ్లబూదుగూరు కోదండరామస్వామి ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



శాంతిపురం తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

శాంతిపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాళ్లబూదుగూరు కోదండరామస్వామి ఆలయాన్ని మంగళవారం ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.7.80 కోట్లు మంజూరు చేసిందని.. త్వరలోనే పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అంతకుముందు శాంతిపురం, రాళ్లబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తహసీల్దారు కార్యాలయాలను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏపీ ఆర్ కుమార్, తహసీల్దార్ శివయ్య, డాక్టర్ వంశీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, నేతలు ఉయ్యాల జయరామిరెడ్డి, రమేష్ పెద్దన్న, క్లస్టర్ ఇన్‌చార్జిలు వీవీ నాగరాజు, రాజేంద్ర, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే అభివృద్ధి పరుగులు

రొంపిచెర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరీముల్లా అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం రొంపిచెర్ల గ్రామంలో టీడీపీ నాయకులతో కలిసి పాలెంవీధి, బలిజవీధి, బజారువీధుల్లో పర్యటించి ఇంటింటికీ ప్రభుత్వంలో సాధించిన అభివృద్ధి తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగిశెట్టి రామమూర్తి, రాధాకృష్ణ, అంజాద్‌ఖాన్, గౌస్‌పీర్‌ఖాన్, బాబులాల్ పాల్గొన్నారు.



రొంపిచెర్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ముగిసిన వెంకటరమణుడి పవిత్రోత్సవాలు



శ్రీవారికి తిరుమంజనం చేస్తున్న టీటీడీ వేదపండితులు

పుంగనూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణ స్వామి వారి పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. స్థానిక ఆలయంలో తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గత మూడురోజులుగా టీటీడీ వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ వెంకటరమణస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. యాగశాలలో హోమాలు చేశారు. కార్యక్రమాల్లో వేదపండితులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు



చౌడేశ్వరి దేవికి పూజలు చేస్తున్న అర్చకులు శ్రీధర్‌స్వామి

పుంగనూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు తూర్పుమొగసాలలో వెలసిన చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు శ్రీధర్‌స్వామి ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేపట్టారు. ఈనెల 25న చౌడేశ్వరిదేవికి భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా తెప్పోత్సవం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని జెట్టికుల సంఘం, ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభాలు



పలమనేరు మార్కెట్ కమిటీ వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలు



జాతీయ రహదారిని ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలు

పలమనేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో జాతీయ రహదారికి ఆనుకొనే ఉన్న విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా యి. సుమారు రెండు దశాబ్దాల క్రితం పట్టణంలో జాతీయ రహదారి విస్తరణ సందర్భంగా ఉన్న రహదారిని విస్తరించారు. రోడ్డు మధ్యన డివైడర్ ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు వీలుగా పనులు చేపట్టారు. అయితే అప్పటికే ఉన్న విద్యుత్తు స్తంభాలకు కేవలం రెండు నుంచి నాలుగు అడుగుల లోపు సమీపంలోనే రోడ్డు ఉంది. దీంతో రహదారిపై నిత్యం వెళ్లే వందలాది వాహనాలు ఈ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరచూ ఢీకొనడం.. విద్యుత్ అధికారులు విరిగి పోయిన విద్యుత్తు స్తంభాలను తొలగించి మళ్లీ అదే స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డుకిరువైపులా సుమారు 15 అడుగులు ఖాళీ ప్రదేశం ఉన్నప్పటికీ విద్యుత్ అధికారులు ఈ స్తంభాలను జాతీయ రహదారికి దూరంగా ఏర్పాటు చేయక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మూడు నెలల క్రితం ఓ కర్ణాటక బస్సు రాత్రి వేళ ఒక విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కొంతదూరం లాక్కెళ్లింది. అయితే అదృష్టవశాత్తు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. వాహనాలు ఈ విద్యుత్ స్తంభాలను ఢీకొంటే ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉందని.. ఇకనైనా విద్యుత్తుశాఖ అధికారులు ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను జాతీయ రహదారికి దూరంగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం



అశోక్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), జూలై 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం, పద్మనాభనగర్ ఎమ్మెల్యే అశోక్ కుటుంబ సమేతంగా మంగళవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ మాజీ ఛైర్మన్ మణి నాయుడు, పూతలపట్టు పోల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, హేమాద్రి నాయుడు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం

ఐరాల, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎవరికైనా విద్యతోనే సమాజంలో విలువ లభిస్తుందని ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బేబీశ్వరరెడ్డి, ఎంఈవో రుష్యేంద్రబాబు అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ విద్యాపీఠం అడ్మిషన్లకు సంబంధించిన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరచుకోవాలన్నారు. పదవ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సఫలం చేసుకోవాలన్నారు. పదవ తరగతికి 14 సంవత్సరాలు నిండి చదవగలిగిన, రాయగలిగిన వారు అర్హులని తెలిపారు. వీరితో పాటు బడి మధ్యలో మానేసిన వారు చేరవచ్చునన్నారు. అలాగే 15 సంవత్సరాలు నిండి 10వ తరగతి పూర్తి చేసిన వారు ఇంటర్మీడియట్ కోర్సులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ మానేసి, ఫెయిల్ అయిన వారికి చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళకు గాయాలు

పుంగనూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ గాయపడిన సంఘటన మంగళవారం అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లెకు చెందిన శ్రీరాములు భార్య భూదేవి (45) ఇంటి వద్ద మోటార్ స్విచ్ వేయడంతో విద్యుదాఘాతంతో అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్ల సూచనల మేరకు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

యువతి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఓ యువతి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి పుంగనూరు మండలంలో జరిగింది.వివరాలిలా... మండలంలోని మోదుగులపల్లె పంచాయతీ పూజగానిపల్లెకు చెందిన బసవారెడ్డి కుమార్తె మౌనిక (18)ను ఇంటి పనులు చేయలేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో పురుగులమందు తాగి అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువతి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్ల సూచనల మేరకు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

యువకుడి...

మండలంలోని మంగళం పంచాయతీ మంగళం కాలనీకి చెందిన శంకర్ కుమారుడు చంద్రమౌళి (23) పని చేయకుండా తిరుగుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తీసుకెళ్లారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శిక్షార్హులౌతారని ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని డీపీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్య చర్యలపై సమావేశం జరిగింది. సమావేశానికి డీపీవో సుధాకరరావు అధ్యక్షత వహించారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రోజూ చెత్త సేకరణ చేయాలని, లేకుంటే వర్షాకాలం దృష్ట్యా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని, ప్రతి 15 రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుద్ధి చేయాలని ఆదేశించారు. డీపీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు తాగునీరు అందించడంలో శ్రద్ధచూపాలని సూచించారు. పంచాయతీల్లో పారిశుధ్య లోపం కనబడితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ ఎంపీడీవోలు, మేజర్ గ్రామ పంచాయతీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తదితరులు

చిత్తూరు రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసాపల్లి, ముత్తుకూరు, ఆనగళ్లు, పాలూరు పంచాయతీల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పనులు జరగలేదని ఎద్దేవా చేశారు. అనంతరం బంగారెడ్డిపల్లి నుంచి యానాది కాలనీ వరకు సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం తాళంబేడు క్రాస్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, జయచంద్ర నాయుడు, చుడా చైర్‌పర్సన్ హేమలత, మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మంజూష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న దాతలు

యాదమరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కీనాటంపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం గ్రామంలోని దాతలు విద్యాసామగ్రి వితరణ చేశారు. గ్రామానికి చెందిన వల్లేరు రామచంద్ర నాయుడు కుమారులు రూ.10 వేలు, వీరరాఘవ నాయుడు రూ.4 వేలు, ఎస్. జనార్దన్ నాయుడు రూ.2 వేలు సమీకరించి విద్యార్థులకు అవసరమైన పెన్నులు, పాఠ్యపుస్తకాలు, పెన్సిళ్లు తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఎంపీడీవో వేణుగోపాల్, తహసీల్దార్ పార్థసారథి, టీడీపీ అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథనాయుడు, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు వల్లేరు హరినాయుడు, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శశికళ, రమేష్, రసూల్ బాషా, విద్యావతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పుత్తూరు మున్సిపల్ డీఈకి ఈఈగా పదోన్నతి

● చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్‌కు బదిలీ



చంద్రశేఖర్‌రెడ్డి

పుత్తూరు అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ డీఈగా పనిచేస్తున్న టి.చంద్రశేఖర్ రెడ్డికి ఈఈగా పదోన్నతి లభించింది. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది డీఈలకు పదోన్నతి కల్పించి వారికి స్థాన చలనం కలిగించారు.

చంద్రబాబు పాలనలోనే ప్రజా సంక్షేమం

నిండ్ర, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారని సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీరామపురం, మంగళగిరి కండ్రిగ గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశులురెడ్డి, అప్పారావు, లింగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి


శ్రీరంగరాజపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. విలాసవరహాపురం గ్రామ పంచాయతీ, అంకనపల్లిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, బూత్ కన్వీనర్ ఉదయ్‌కుమార్, అంజనేయులు, నాగల చిన్నప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● పాలసముద్రం (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకావేరిరాజుపురం, శ్రీకావేరిరాజుపురం ఆదిఆంధ్రవాడ, అయ్యప్పరాజుకండ్రిగ గ్రామాల్లో మంగళవారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు సాంబశివన్, అరుళ్‌నాథన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విజయపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కోసలనగరం సింగిల్ విండో అధ్యక్షుడు బాబుయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జంబాడ, కోసలనగరంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కపిల్, రవిరాజు, నరేష్, సుబ్రహ్మణ్యం, బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విజయపురం, జూన్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళం, క్షూరికాపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రయ్య చేతుల మీదుగా క్రయాన్స్, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు నా వంతు సాయం అందిస్తున్నామని తెలిపారు. హెచ్‌ఎం రత్న, శ్రీనివాసులు, రామకృష్ణా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కోశాధికారిగా హరినాథ నాయుడు



గంగాధరనెల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కోశాధికారిగా గంగాధరనెల్లూరు మండలం పాచిగుంట గ్రామానికి చెందిన పొదిలి హరినాథ నాయుడిని నియమించినట్లు ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మూడోసారి పార్లమెంట్ బీజేపీ కోశాధికారిగా నియామకం చేసినందుకు జిల్లా పార్టీ అధ్యక్షుడు జగదీశ్వర నాయుడితో పాటు వివిధ విభాగాల నేతలు, కారకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

తుంపర్ల వానతో తంటా



వర్షంలో తడుచుకుంటూ వెళ్తున్న నగరవాసులు

చిత్తూరు కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం సాయంత్రం తుంపర్ల వర్షం పడటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లు బురదమయం కావడంతో పలువురు వాహనదారులు జారి పడి గాయాలు కావడంతో ఆస్పత్రుల పాలయ్యారు. చర్చివీధి, బజారువీధుల్లో చిరు వ్యాపారులు చిత్తడి వానతో మూటా ముల్లే సర్దుకుని ఇళ్లకెళ్లిపోయారు.

ఆటోను ఢీకొన్న స్కూటీ

పూతలపట్టు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న ఆటోను ఓ స్కూటీ ఢీకొనడంతో ఓ విద్యార్థిని గాయాలపాలైంది. పూతలపట్టు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న రచన అనే విద్యార్థిని పని నిమిత్తం మంగళవారం సాయంత్రం రంగంపేట క్రాస్‌కు వెళ్లేందుకు స్కూటీలో బయలుదేరింది. పూతలపట్టు చెరువు సమీపాన ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ముందు వెళ్తున్న ఆటోను వెనుకవైపు నుంచి ఢీకొంది. దీంతో గాయాలపాలైన విద్యార్థినిని స్థానికులు ఆటోలో పి.కొత్తకోట పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం



అశోక్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), జూలై 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం, పద్మనాభనగర్ ఎమ్మెల్యే అశోక్ కుటుంబ సమేతంగా మంగళవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, పూతలపట్టు పోల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, హేమాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డీసీసీబీని సందర్శించిన ధనుంజయరెడ్డి



నెల్లూరు డీసీసీబీ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న శంకర్‌బాబు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని నెల్లూరు డీసీసీబీ చైర్మన్ ఎం.ధనుంజయరెడ్డి మంగళవారం సందర్శించారు. కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు చిత్తూరు డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బ్యాంకు పనితీరును చిత్తూరు చైర్మన్‌కు వివరించారు. చిత్తూరుతో పాటు నెల్లూరు డీసీసీబీ సైతం రుణవితరణలో రాష్ట్రస్థాయిలో నాబార్డు ద్వారా అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు గుర్తింపు పొందిన సందర్భంగా నెల్లూరు డీసీసీబీ చైర్మన్ ధనుంజయ రెడ్డి, చిత్తూరు డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డిని అభినందించారు. తొలుత ధనుంజయ రెడ్డికి బ్యాంకు సీఈవో సి.శంకర్‌బాబు పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు లీగల్ ఆఫీసర్ వై.గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ప్రదోష పూజలు



ప్రదోష పూజల్లో విశేష అలంకారంలో శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర

చిత్తూరు కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కట్టమంచి కులందేశ్వర ఆలయంలో ఈవో సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం స్వామి అమ్మవార్లకు త్రయోదశి ప్రదోష పూజలు జరిగాయి. స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించి, విశేష అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో త్రయోదశి ప్రదోష పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు మహేష్. స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించి, విశేష అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. దేవదాయశాఖ సిబ్బంది చెంగల్ రాయలు, రెడ్డెప్ప, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంచి కామాక్షిగా దర్శనమిచ్చిన దేశమ్మ

నగరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని టీఆర్‌కండ్రిగ వద్ద గల దేశమ్మ దేవాలయంలో ఆడిమాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆడిమాస మొదటి మంగళవారం దేశమ్మ తల్లి కంచి కామాక్షి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ ఏఈవో వెంకటేశ్వర్లు ఏర్పాట్లను సమీక్షించి, భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేయించారు.


విద్యుత్ డీఈఈగా బాధ్యతల స్వీకరణ



డీఈఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకరరావు

నగరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరి విద్యుత్ సబ్‌డివిజన్ డీఈఈగా చిత్తూరు నుంచి బదిలీపై వచ్చిన ప్రభాకరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనను ఆశాఖ సిబ్బంది సన్మానించారు. డీఈఈ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా వినియోగదారులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

థామస్‌కు సన్మానం



థామస్‌ని సన్మానిస్తున్న కాపు సంక్షేమ నేత ప్రసాద్

వెదురుకుప్పం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను మంగళవారం కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు, కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పేటి ప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. ఆయన వెంట వన్నియకుల క్షత్రియ రాష్ట్ర డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ఎస్సీ సెల్ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మరకాలకుప్పం సుధాకర్ ఉన్నారు.

నిత్యావసర వస్తువులు సక్రమంగా పంపిణీ చేయాలి

నిండ్ర, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌకదుకాణ డీలర్లు నిత్యావసర వస్తువులను రేషన్ కార్డు దారులకు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ శేషగిరిరావు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సకాలంలో డీడీలు చెల్లించి ప్రభుత్వం నిర్దేశించిన తేదీ లోపు పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఆర్‌ఐ ప్రభాకర్, వీఆర్‌వోలు, డీలర్ల సంఘ అధ్యక్షులు అప్పారావు, డీలర్లు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్వాకంతో

మా భూములు అమ్ముకోలేకపోతున్నాం

● మండల సమావేశంలో వైసీపీ సభ్యుల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అబ్బూ అనిత

గంగాధరనెల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన భూముల రీసర్వే కారణంగా తమ భూములను అమ్ముకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆ పార్టీకే చెందిన పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అబ్బూ అనిత అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన పెద్దకాల్వ సర్పంచ్ ఏకాంబరం, వెజ్జుపల్లె సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, వేపంజేరి ఎంపీటీసీ రామచంద్రారెడ్డిలు మాట్లాడుతూ రీసర్వే వల్ల ఏర్పడిన సమస్యలతో భూములను విక్రయించుకోలేక నానాతంటాలు పడుతున్నామన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన రీసర్వే వల్ల ఇబ్బందులు పడే వారు సమస్యను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. గంగాధరనెల్లూరు, తూగుండ్రం పీహెచ్‌సీల డాక్టర్లు గురుప్రకాష్, ప్రవీణ్ మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రసాద్, ఏఎస్‌డబ్ల్యువో షకీలా, విద్యుత్‌శాఖ ఏఈ వరదరాజులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధలు ఆయా శాఖలకు సంబంధించిన వివరాలను సభ్యులకు వివరించారు. గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఎంపీడీవో కృష్ణ మహేష్‌రెడ్డి మాట్లాడుతూ సమావేశానికి హాజరైన కొంతమంది అధికారులు ఎప్పుడుపడితే అప్పుడు బయటకు వెళ్లడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. సమావేశంలో జడ్పీటీసీ దుద్దుకూరు లక్ష్మీప్రియ, మండల వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి, ఏవో భవాని, ఎంఈవో గుణశేఖర్‌రెడ్డి, ఇరిగేషన్, హౌసింగ్ శాఖల ఏఈలు భాస్కర్‌రెడ్డి, శ్రీధర్, మండల వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్, సిద్దేశ్వరకొండ వెటర్నరీ డాక్టర్ వంశీ, ఏఎస్‌ఐ మురళీప్రసాద్, తూగుండ్రం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ, హౌసింగ్ వర్క్‌ఇన్స్‌పెక్టర్ గీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి



ఎస్సీ హాస్టల్‌లో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు చూస్తోందని ప్రభుత్వ విప్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ అన్నారు. మంగళవారం వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన థామస్ ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. థామస్ మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గ వర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్లస్టర్ ఇన్‌చార్జిలు పి.మోహన్‌మురళి, కె.చెంగల్రాయరెడ్డి, నాయకులు సాతాల గుణశేఖర్‌యాదవ్, మోహన్‌యాదవ్, భాష్యం సతీష్ నాయుడు, మరకాలకుప్పం సుధాకర్, గురుసాల కిషన్‌చంద్, బోడిరెడ్డి సుధాకరరెడ్డి, ఎం.రాజశేఖర్ వర్మ పాల్గొన్నారు. అనంతరం మంగళవారం రాత్రి పచ్చికాపల్లంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను సందర్శించిన థామస్ పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి సాయం



విద్యార్థులకు నోట్‌బుక్స్, జామెట్రీ బాక్సులు అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు ఈశ్వర నాయుడు, కళ్యాణ్

బంగారుపాళ్యం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబపాళ్యం, కచ్చేటి వారిపల్లె, ఈచనేరిపల్లె, వంకరవారిపల్లె, గడ్డవారిపల్లె, పెరుమాళ్ళపల్లి, తుంబకుప్పం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈశ్వర్ కళ్యాణ్ అభయా ట్రస్టు ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, జామెట్రి బాక్స్‌లను ఆ ట్రస్టు నిర్వాహకులు ఈశ్వర్ నాయుడు, మమత, కళ్యాణ్‌లు మంగళవారం అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ప్రతి ఏడాది మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు తమ ట్రస్టు ద్వారా విద్యాసామగ్రి అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నాయకులు తిలక్ యాదవ్, బుజ్జి నాయుడు, నరేష్ నాయుడు, ఎంఈవో నాగేశ్వర్‌రావు, హెచ్‌ఎం లక్ష్మీకాంతమ్మ, ఉపాధ్యాయులు రఘుపతి నాయుడు, లిల్లెమ్మ, బాలాజీ పాల్గొన్నారు.

సాంబశివనాయుడి మృతి తీరనిలోటు: టీడీపీ



సాంబశివనాయుడి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ తుమ్మల సాంబశివ నాయుడి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యేలు ఏఎస్.మనోహర్, గాంధీ అన్నారు. మంగళవారం బట్టువాళ్లఊరులో సాంబశివనాయుడి భౌతికకాయానికి వారు నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, వసంతనాయుడు, కాజూరు బాలాజీ, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, చెన్నకేశవులనాయుడు, జీవన్, బాలాజీనాయుడు, హేమాద్రినాయుడు, రాజ, రవినాయుడు, శంకర్‌చౌదరి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నేతలు జనార్దన్, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్ నాయుడు తదితరులు నివాళులు అర్పించారు.

విద్యతోనే సమాజంలో గౌరవం

ఐరాల, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎవరికైనా విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బేబీశ్వరరెడ్డి, ఎంఈవో రుష్యేంద్రబాబు అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ విద్యాపీఠం అడ్మిషన్లకు సంబంధించిన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరచుకోవాలన్నారు. పదవ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సఫలం చేసుకోవాలన్నారు. పదవ తరగతికి 14 సంవత్సరాలు నిండి చదవగలిగిన, రాయగలిగిన వారు అర్హులని తెలిపారు. వీరితో పాటు బడి మధ్యలో మానేసిన వారు చేరవచ్చునన్నారు. అలాగే 15 సంవత్సరాలు నిండి 10వ తరగతి పూర్తి చేసిన వారు ఇంటర్మీడియట్ కోర్సులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. వీరితో పాటు ఇంటర్మీడియట్ మానేసి, ఫెయిల్ అయిన వారికి చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువు కొనసాగించి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శిక్షార్హులౌతారని ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని డీపీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్య చర్యలపై సమావేశం జరిగింది. సమావేశానికి డీపీవో సుధాకరరావు అధ్యక్షత వహించారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజూ చెత్త సేకరణ చేయాలని, లేకుంటే వర్షాకాలం దృష్ట్యా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని, ప్రతి 15 రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుద్ధి చేయాలని ఆదేశించారు. డీపీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు తాగునీరు అందించడంలో శ్రద్ధచూపాలని సూచించారు. పంచాయతీల్లో పారిశుధ్య లోపం కనబడితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ ఎంపీడీవోలు, మేజర్ గ్రామ పంచాయతీ, మండల కేంద్ర పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంగ్రామ దేవత బంగారమ్మకు పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

నాబార్డు అవార్డు గ్రహీతలకు సన్మానం



నగరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నాబార్డు నిబంధనలు పాటించడంలోనూ, బ్యాంకు లావాదేవీలు, కంప్యూటరీకరణ, బ్యాంకు వ్యాపార అభివృద్ధిలో ముందడుగు వేయడంతో నగరి పీఏసీఎస్‌కు నాబార్డు అవార్డు లభించింది. ఇందుకు గాను సీఈవో తులసిపిళ్లై, చైర్మన్ బాలాజీ, డైరెక్టర్ జవహర్‌రెడ్డిని పీఏసీఎస్ సిబ్బంది, రైతులు అభినందించారు. నగరి పీఏసీఎస్ ఆవరణలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది శేఖర్, కార్తీక్, రైతు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి పలువురి సంతాపం



రమేష్ నాయుడి భార్యకు నగదును అందజేస్తున్న ఎంఈవో

బంగారుపాళ్యం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ రాగిమానుపెంట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రమేష్ నాయుడు (52) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఎంఈవోలు నాగేశ్వర్, రమేష్‌బాబు, ఉపాధ్యాయులు రఘుపతి నాయుడు, మోహన్‌రెడ్డి, జగదీష్, లక్ష్మీపతితో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్సీ ధరణీప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు ఎన్సీ జయప్రకాష్, జయచంద్ర నాయుడు, జనార్దన్‌గౌడ్, కోకా ప్రకాష్ నాయుడు, హేమచంద్ర నాయుడులు రమేష్ నాయుడి భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దహనక్రియలకు గాను రూ.25 వేల నగదును ఎంఈవో నాగేశ్వర్‌రావు కుటుంబ సభ్యులకు అందజేశారు.

పౌల్ట్రీ ఫార్మ నమూనా పోటీపై అవగాహన

నగరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పౌల్ట్రీ ఫార్మ నమూనా, పౌల్ట్రీ రంగంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఫౌల్ట్రీ ఫార్మ ప్రాముఖ్యత గురించి, ప్రపంచ వ్యాప్తంగా పౌల్ట్రీకి పెరుగుతున్న డిమాండ్ గురించి వివరించారు. పౌల్ట్రీ ఫార్మ నమూనా పోటీకి న్యాయనిర్ణేతలుగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్, కేఎస్ మనోజ్ వ్యవహరించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడికి సన్మానం



గంగాధరనెల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడికి నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు మంగళవారం శాలువాలు కప్పి, గజమాలతో ఘనంగా సన్మానించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి లోకనాథ నాయుడు, టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, నాయకులు శ్రీధర్ యాదవ్, నాగేశ్వరరాజు, రుద్రయ్యనాయుడు, స్వామిదాస్, చెంగల్రాయయాదవ్, జయశంకర్‌నాయుడు, లోకనాధరెడ్డి, హరీషయాదవ్, లోకమ్మ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కావనూరులో ఉచిత కంటి వైద్య సేవలు




కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిండ్ర, జూలై 22(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కావనూరు పంచాయతీలో రాస్, చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 28 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరందరికీ చెన్నైలోని శంకర నేత్రాలయ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాస్ ఫీల్డ్ అధికారి తేజ, శంకర నేత్రాలయ వైద్యులు వెంకటముని, కావనూరు సర్పంచ్ మహేష్, మాజీ ఎంపీటీసీ జగన్, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలి

వెదురుకుప్పం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించి వారికి సరైన వైద్య సేవలు అందించాలని, పుట్టిన ప్రతి బిడ్డకు తప్పిపోకుండా వ్యాక్సినేషన్ వందశాతం చేయాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు ఆదేశించారు. మంగళవారం వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి వెంకటప్రసాద్‌తో కలసి తనిఖీ చేశారు. ఆ తర్వాత వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ చెంగారెడ్డి, సీహెచ్‌వో మధు, సిబ్బంది పాల్గొన్నారు.

సరదాగా కాసేపు...!



పచ్చికాపల్లంలో టీ మాస్టరుగా కనిపిస్తున్న థామస్

వెదురుకుప్పం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంగళవారం వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో ఆసక్తికర సంఘటనలు జరిగాయి. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారంలో, వృత్తి పరంగా బిజీగా గడిపే ప్రభుత్వ విప్ థామస్ గురించి విన్నాం. కానీ, పచ్చికాపల్లంలో ఆయన టీ మాస్టరు అవతారం ఎత్తి 'టీ' వేశారు. అలాగే మరో బజ్జీల దుకాణంలో సరదాగా కార్యకర్తలతో కలసి 'వడ' భుజించారు. ఇలా కార్యకర్తలను, నాయకులను, స్థానికులను థామస్ ఉత్సాహపరిచారు.